ఉద్రిక్తతల నడుమ కూల్చివేతలు

స్వామి వివేకానంద నగర్‌లోని పేదల ఇళ్లు కూల్చివేత

వివేకానందనగర్ బస్తీలో రెక్కాడితేగానీ డొక్కాడని బడుగు బలహీనవర్గాల వారే అధికం. వారంతా రోజు కూలీ, ఇతర పనులు చేసుకుంటూ సంపాదించుకున్న దాంతో ఇళ్లను నిర్మించుకున్నారు. తరతరాలుగా వారు ఈ ఇళ్లల్లో నివాసం ఉంటున్నారు. అయితే అక్రమ నిర్మాణాలు.. కోర్టు ఆదేశాలు అంటూ సోమవారం ఉదయం దాదాపు 22 ఇళ్లను రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు కూల్చివేశారు.

- పోలీసు భద్రత నడుమ కూల్చివేసిన రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ సిబ్బంది
- లోబోదిబోమన్న బాధితులు
- పెట్రోలు పోసుకుని నిప్పంటించుకునేందుకు బాధితుడి యత్నం: అడ్డుకున్న పోలీసులు
- బాధితులకు బీజేపీ కార్పొరేటర్ల, పలువురి నేతల సంఘీభావం
- అరెస్టు చేసి నాంపల్లి పీఎస్‌కు తరలించిన పోలీసులు


పోలీసులతో వాగ్వాదం చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నేత కోదండరెడ్డి


కార్పొరేటర్ పావనిని అరెస్టు చేస్తున్న దృశ్యం


ఉద్రికత్తల నడుమ ఇళ్లను కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది

చిక్కడపల్లి: దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లను కూల్చివేయడంపై వివేకానందనగర్ బస్తీలోని పేదలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూల్చివేతల సందర్భంగా స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, రాంనగర్, ముషీరాబాద్, కవాడిగూడ కార్పొరేటర్లు రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, రచనశ్రీలు కూల్చివేతలను అడ్డుకోవడానికి ప్రయత్నించగా వారిని అరెస్టు చేసి నాంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధరణి కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.కోదండరెడ్డితోపాటు కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, జి.ఎస్.కేశవ్ తదితరులు కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించగా వారిని పోలీసులు అడ్డుకున్నారు. ఓ దశలో బాధితుడు ఆనంద్‌రావు పెట్రోల్ తెచ్చి వంటిపై పోసుకుని నిప్పంటించుకునే యత్నం చేయగా పోలీసులు అడ్డుకుని అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీనగర్ కార్పొరేటర్ పావని మాట్లాడుతూ... ఈ బస్తీకి సమీపంలో శతాబ్ది అపార్ట్‌మెంట్‌ను ఇరవై సంవత్సరాల క్రితం నిర్మించారని... ఆ అపార్ట్‌మెంట్ వారికి రాకపోకలకు అడ్డుగా ఉన్న ఈ బస్తీని తొలగించాలని అధికారులపై వత్తిడి తేవడంతోనే బస్తీలోని ఇళ్లను కూల్చివేశారని మండిపడ్డారు. హైకోర్టు ఆదేశాల మేరకే ఇళ్లు కూల్చివేశామని చెబుతున్న తహసీల్దార్ అదే హైకోర్టులో మరో కేసు వచ్చే నెల 6వ తేదీనే వాయిదా ఉన్నప్పటికి ఎందుకు అర్థాంతరంగా వచ్చి ఇళ్లను కూల్చివేశారని ప్రశ్నించారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరా : ఎమ్మెల్యే ముఠా గోపాల్

ఇళ్ల కూల్చివేతల విషయం తెలుసుకొని అక్కడికొచ్చిన ముషారాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కలెక్టర్‌తో మాట్లాడానని.. బాధితులకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. అన్యాయంగా ఇళ్లను కూల్చేశారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.


బీజేవైఎం నగర మాజీ అధ్యక్షుడు వినయ్ కుమార్‌ను వ్యాన్‌లో తరలిస్తున్న పోలీసులు

పునరావాసం కల్పించాలి


ఉన్న ఇల్లు పోయింది. మా వారు కూలి పనులు చేస్తారు. ఇల్లు లేకుండా పోతే ఎక్కడ ఉండాలి. పునరావాసం కల్పించే దాకా ఇక్కడ నుంచి కదలం. టెంట్ వేసుకుని ఇక్కడే ఉంటాం.
– వద్దపల్లి ఇందు

న్యాయం చేయాలి


నా భర్త కేన్సర్‌తో చనిపోయాడు. పిల్లలు ఇద్దరు చదువుకుంటున్నారు. ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ పని చేసి వచ్చే కొంత డబ్బుతో బతుకుతున్నాను. ఇల్లు కూల్చేస్తే ఎలా బతకాలి. కనీస సమాచారం ఇవ్వకుండా కూల్చేశారు.
– వసునూరి ఝాన్సీ

మొత్తం కూల్చేశారు

రూ. 7.50 లక్షలు వెచ్చించి ఇంటిని నిర్మించుకున్నాం. మా తాత ముత్తాతల కాలం నుంచి దాదాపు ఇక్కడే జీవిస్తున్నాం. ప్రైవేటు ఉద్యోగాలు చేసుకుంటూ కొంత కొంత డబ్బు కూడబెట్టి ఇల్లు కట్టుకుంటే దాన్ని కూల్చేశారు. ఇంట్లోని సామాన్లను ధ్వంసం చేశారు. ఇక బతకడమే వృథా అనిపిస్తోంది. మాకు నివాసం కల్పించకపోతే ఇక్కడే చస్తాం. – ఆనంద్‌రావు

ఎక్కడికి పోవాలి


ఉన్న ఇల్లు పోయింది. ఎక్కడికి వెళ్లి బతకాలి. ఉన్నపళంగా రోడ్డుపైకి తెచ్చారు. మాకు న్యాయం చేయాలి. ముగ్గురు కొడుకులుంటే ఇద్దరు చనిపోయారు. భర్త లేదు. ఒక్క కొడుకు ఉన్నాడు. కాజాలు కుట్టి బతుకుతున్నా. కొడుకు కూడా ఏమీ పనిచేయడు. ఇల్లు లేకుండా పోతే ఎలా ఉండాలి. – ఎ.భారతి

ఇళ్ల కూల్చివేత అన్యాయం: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


బాధితులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

చిక్కడపల్లి: స్వామి వివేకానందనగర్ బస్తీవాసుల ఇండ్లను కూల్చివేత అన్యాయమని కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి గాంధీనగర్ డివిజన్‌లోని స్వామి వివేకానంద బస్తీవాసులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... కోర్టు తీర్పు పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదన్నారు. 23 ఇండ్లను నేలమట్టం చేయడం గత బీఆర్‌ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు వారికి ప్రత్యమ్నాయంగా డబుల్ బెడ్‌రూం కానీ అమానుషమైన చర్య అన్నారు. కలెక్టర్, అధికారులతో కూడా మాట్లాడినా ఎలాంటి చర్యలు లేకుండా వారిని కట్టుబట్టలతో నడిరోడ్డుపై పడవేయడం చాలా దారుణమన్నారు. ఇకనైనా సీరియస్‌గా తీసుకొని వారికి నష్టపరిహారం పునరవాసం కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన బాధితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇవ్వాలని అన్నారు. గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు పూస రాజు, సాయిచంద్, ఉమేష్, ఆనంద్‌రావు, ఎం.బి.కృష్ణ, సాయి, బాధితులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు గుండు జగదీశ్ బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావుల ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను సోమవారం రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, మాజీ ఎంపీ అంజన్‌కుమార్, అనిల్‌కుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. నాయకులు గుర్రం దినేశ్, సురేందర్, శీలం సత్యనారాయణ, బాను, అభిషేక్ కెనడీ, నరేందర్, కవిత, మధుమతి, అస్లాం, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంకు శుభాకాంక్షలు



ముషీరాబాద్: తెలంగాణ ఉద్యమ సారథి, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడిగా ఎన్నికైన ప్రొఫెసర్ కోదండరాంను ముషీరాబాద్ జేఏసీ కన్వీనర్ కిరణ్‌కుమార్ కలిసి అభినందనలు తెలిపారు. తార్నాకలోని కోదండరాంను ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నరసయ్య, నాయకులు పులిపాటి సుధాకర్, కాకునుడు సుధాకర్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను ప్రోత్సహించడం ఉత్తమ సంస్కారం


భారత కీర్తి మూర్తులు అనే పుస్తకాన్ని అవిష్కరిస్తున్న ఇనాక్ తదితరులు

చిక్కడపల్లి: ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ఉత్తమ సంస్కారమని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉప కులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. మానస ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయ గానసభల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గుండవరపు హనుమంతరావు కళావేదికలో ప్రముఖ సినీదర్శక నిర్మాత, రచయిత లక్ష్మణరేఖ గోపాలకృష్ణ రచించిన భారత కీర్తి మూర్తులు గ్రంథాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీహెచ్ హనుమంతరావు స్మారక పురస్కారాన్ని ప్రముఖకవి బందారుపల్లి రామచంద్రరావుకు ప్రదానం చేసి సన్మానించారు. రచయిత్రి ఆచార్య శరత్‌జ్యోత్స్నారాణి, జి.ఎల్.నరసింహారావు, సి.హెచ్.ఆర్.వి.కె.మూర్తి, సంపత్‌రావు, లలితావాణి, రఘుశ్రీ, కె.భవాని తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పంచరత్న కీర్తనలు

నల్లకుంట: శ్రీ త్యాగరాజ స్వామి 176వ ఆరాధన ఉత్సవం, సరస్వతీ సంగీత విద్యాలయం 68వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీ సరస్వతి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం పునచ్చరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్, పంచశత వీణాగాన రత్న పోపూరి శ్రీనివాస శర్మ, ప్రముఖ వీణా విద్వాంసురాలు మల్లాది శాంతా మూర్తిల పంచరత్న కీర్తనల గాన వాద్య కచేరీతో ఆకట్టుకున్నారు. అలాగే వాసుకీదేవి శాస్త్రీయ నృత్యం ప్రాక్టీస్ చేశారు.

3 నుంచి త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు

నల్లకుంట: శ్రీ రామ గానసభ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3 నుంచి 11వ తేదీ వరకు త్యాగరాజ స్వామి 53వ ఆరాధనా సంగీతోత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని గానసభ కార్యదర్శి కొణికి సాయి శ్రీనివాస శర్మ తెలిపారు. సోమవారం న్యూ నల్లకుంటలోని రామగాన సభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ఆరాధనోత్సవాల వివరాలు వెల్లడించారు. న్యూ నల్లకుంటలోని శ్రీ సీతా రామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలో ఆరాధన సంగీతోత్సవాలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్‌సీపీడీసీఎల్-11 కేవీ ఆజామ్‌బాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల నిమిత్తం కారణంగా మంగళవారం ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. అహోబిల్ ఫీడర్ పరిధిలో లైఫ్ ఆసుపత్రి, ఏటీఐ క్యాంపస్, హోటల్ మెనేజ్‌మెంట్, ఆంధ్రాబ్యాంక్, సాయిబాబా ఆలయం తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. సాయి మధురానగర్ ఫీడర్ పరిధిలో గోల్కొక, సాయిమధురానగర్, బతుకమ్మ కుంట, చెంచుబస్తీ, పోచమ్మ బస్తీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు. ప్లే గ్రౌండ్ ఫీడర్ పరిధిలో బుర్జుగల్లి, కుమ్మరివాడ, ఎరుకల బస్తీ, గాంధీ బొమ్మ, వాణి ఫొటో స్టూడియో తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4.30 వరకు విద్యుత్ ఉండదన్నారు. రెడ్ బిల్డింగ్ ఫీడర్ పరిధిలో రామంతాపూర్ పాలిటెక్నిక్ కాలేజ్, న్యూ వినాయక్ నగర్, ఇండియన్ పెట్రోల్ బంక్, మల్లికార్జుననగర్, రామకృష్ణ నగర్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. సంజీవయ్యనగర్ ఫీడర్ పరిధిలో తిలక్‌నగర్, మీసేవా, శివాలయం టెంపుల్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం 4 నుంచి 5.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏడీఈ వివరించారు.

కులగణనను స్వాగతిస్తున్నాం

కాచిగూడ: కుల గణనకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అందుకు అవసరమైన విధివిధానాలను సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించడాన్ని తాము స్వాగతిస్తున్నామని అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ ప్రధానకార్యదర్శి, ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ అన్నారు. సోమవారం నారాయణగూడలోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... కులగణన చేపట్టడం లాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకుని నిజమైన అభివృద్ధి, సంక్షేమాన్ని రాష్ట్ర ప్రజలకు అందించే సత్తా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. కులగణనపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో తీర్మానం చేసి చట్టబద్ధత తీసుకురావాలన్న నిర్ణయంతో రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేయగలిగే శక్తి కాంగ్రెస్ పార్టీకే ఉందని నిరూపించుకుందన్నారు.

అలరించిన రంగవల్లులు


మహిళలు వేసిన ముగ్గు

కాచిగూడ: హరివిల్లును తలపించే రంగులు... మగువలచే జారిన 'చుక్కల' వెలుగులు... నయన మనోహరమైన ముగ్గుల సోయగాలతో నారాయణగూడలోని పద్మశాలీ భవన్‌లో సంక్రాంతి లక్ష్మీ సందడి చేసింది. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు, సామాజిక విభాగం అధ్యక్షురాలు గుంటక రూప సదాశివ్ ఆధ్వర్యంలో సోమవారం పద్మశాలీ భవన్‌లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన లభించింది. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ముత్యమంత ముగ్గులతో మురిపించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను మేళవిస్తూ రంగవల్లులు తీర్చిదిద్దారు. అలంకరించిన తీరుతో వివిధ విభాగాల్లో ఎంపిక చేసి బహుమతులకు అందజేశారు. పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భోగి మంటలు, గొబ్బెమ్మ పాటలతో నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. తంబోలాలో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. వీవర్స్ వెల్ఫేర్ ట్రస్టు చైర్మన్ బర్రెంకల మధుసూదన్, అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి, మోత్కూరి విజయలక్ష్మీ, చిప్ప రఘురాములు, డాక్టర్ వాణి పటాలే, వడ్డెపల్లి రచన, వనం దుశ్యంతల, పోరండ్ల శారద, భాసాని పద్మ, బండారి లక్ష్మీ, చిలువేరి సునిత, భూరం వీణా, చిన్నకొట్ల స్వప్న నోముల రేఖ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న దృశ్యం

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం

అంబర్‌పేట్: ప్రజలకు మౌలిక వసతులే కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. సోమవారం అంబర్‌పేట్ డివిజన్‌లోని దుర్గానగర్‌లో రూ. 60 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్, డ్రైనేజీ పైపులైన్ పనులను స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం దుర్గానగర్‌లో ఎమ్మెల్యే పాదయాత్ర చేసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలను నిర్మించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సమస్యల పరిష్కరించే విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. కార్యక్రమంలో ఆయా విభాగాల అధికారులు, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


దుర్గానగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు, కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

ఎస్సీ వర్గీకరణ విషయంలో ద్వంద్వ వైఖరి వీడాలి


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: ఎస్సీ వర్గీకరణ విషయంలో ద్వంద్వ వైఖరి పాటిస్తున్న కాంగ్రెస్, బీజేపీలు తమ వైఖరిని మార్చుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. విద్యానగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లేష్ మాదిగ అధ్యక్షతన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ మాట్లాడుతూ... మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణ విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు వర్గీకరణ చేయకుండా ద్వంద్వ వైఖరిని పాటిస్తున్నాయన్నారు. ప్రస్తుతం పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే బిల్లు పెట్టి మోదీ ప్రభుత్వానికి మాదిగలపై ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. లేదంటే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి ఓటు ద్వారా బుద్ధి చెప్తామని హెచ్చరించారు. రాష్ట్ర సీనియర్ నాయకులు మేరీ మాదిగ, బంగారి శ్రీను, నందకిషోర్, వేణు, పాలడుగు శ్రీను, రాణి, శ్యామ్‌రావు, సురేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని బాలుడి అదృశ్యం


వి.సాయి రుత్విక్

నల్లకుంట: తండ్రి మందలించాడని అలిగిన ఓ మైనర్ బాలుడు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ సమాచారం మేరకు.. వెల్డింగ్ పనులు నిర్వహించే వి. శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి విద్యానగర్‌లో నివాసముంటున్నాడు. స్థానికంగా ఎనిమిదో తరగతి చదువుతున్న ఈయన కుమారుడు వి. సాయి రుత్విక్(14) తరుచూ ఫోన్ చూస్తుండటంతో తండ్రి మందలించాడు. దీంతో సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో నేను ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని ఓ లెటర్ రాసి పెట్టి తన సైకిల్ తీసుకుని బయటకు వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా కుమారుడి ఆచూకీ లభించలేదు. తండ్రి శ్రీకాంత్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం నల్లకుంట పోలీసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్విరాన్‌మెంట్ కౌన్సిల్ కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కోదండరాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కోదండరాం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ మనుగడకు ఆధారమైన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ జనసమితి హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య, కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సి.హెచ్.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కోదండరాంకు దివ్యాంగ ఉద్యోగుల సన్మానం



చిక్కడపల్లి: ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా ఆయనను దివ్యాంగ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సోమవారం సన్మానించారు. సంఘం గౌరవ అధ్యక్షుడు నరసయ్య పర్యవేణలో రాష్ట్ర అధ్యక్షుడు హబీబ్, నగర అధ్యక్షుడు బొల్లం మహేందర్ తదితరులు కోదండరాంను సన్మానించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యలపై వారితో కోదండరాం చర్చించారు.

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎమ్మెల్సీగా నియమితులైన ప్రొఫెసర్ కొదండరాంను ప్రొఫెషనల్ సోషల్ వర్క్ అసోసియేషన్ అధ్యక్షుడు సుర్వి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి గాజుల సత్యనారాయణలు సోమవారం శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.



కోదండరాంకు సత్కారం

కాచిగూడ: తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం ఎమ్మెల్సీగా ఎంపికైన నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘం ప్రతినిధులు సోమవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నేతలు నీలం వెంకటేష్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలకులకు గుణపాఠం తథ్యం

ముషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంటూ అప్రకటిత నిర్బంధాన్ని కొనసాగిస్తుందని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మంద నవీన్, పాడపంగి నాగరాజులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ జిల్లా జనరల్ కౌన్సిల్‌ని అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. భద్రాచలం పట్టణంలో జరిగే ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జనరల్ కౌన్సిల్‌కు పోలీసులు అనుమతిని నిరాకరిస్తూ సభను అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన అప్రకటిత నిర్బంధం అలాగే కొనసాగుతుందని ప్రజా పరిపాలన అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రశ్నించే గొంతులను నొక్కిపెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనిని పిడిఎస్‌యూ చూస్తు ఊరుకోదని స్పష్టం చేశారు. తమ ఉద్యమాలను మరింత ఉదృతం చేస్తామని హెచ్చరించారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట, రఘువీర్ విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్, పద్మకాలనీ హౌసింగ్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటల నుంచి పద్మా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు తెలిపారు. శిబిరంలో డెంటల్, బీపీ, షుగర్, ఈసీజీ, నేత్ర పరీక్షలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి



కాచిగూడ: ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ సూచించారు. సోమవారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం కోఠి ఆధ్వర్యంలో కాచిగూడ చెప్పల్ బజార్‌లో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు అక్కడికి వచ్చిన ప్రజలకు వివిధ వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారిని మందులను పంపిణీ చేశారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, పద్మజ, ఇంద్ర, సబిత, అనురాధ, మల్లికార్జున్, వెంకటేష్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, రమాదేవి, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ (నాక్స్) ఇండియా ఆధ్వర్యంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్న సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ కోర్సుల్లో శిక్షణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు కోరుతున్నట్లు సంస్థ డైరెక్టర్ విమలారెడ్డి తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ డిప్లొమా అర్హత గల అభ్యర్థులు శిక్షణ కోసం ఫిబ్రవరి 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్: 78931 41797.